# సాలెగూ(గో)డు

ధూళిపాళ అన్నపూర్ణ

**నేను తాళం తీసుకుని లోపలికి వెళ్లి గ్లాసు చల్లటి మంచినీళ్ళు తాగి సోఫాలో చతికిలపడ్డాను. ఇంతలో రివ్వుమంటూ నా పదేళ్ల కొడుకు నందూ పరిగెత్తుకొచ్చాడు.**

"అమ్మా! డాడీ రెండు నెలల్లో కారు కొనేస్తారుట. ప్రపంచంలోని అన్ని దేశాలకు మధ్యనున్న గేట్లు తెరిచేశారుట. కార్లు 'చర్'మంటూ మనదేశంలోకి దూసుకు వచ్చేస్తున్నాయటే! చాలా చీప్‌గా కొనుక్కోవచ్చని పొద్దుట అంకుల్‌తో చెప్తున్నాడు నాన్న. అమ్మా! అమ్మా! మనం కార్లో ముందు సాయిబాబా గుడికి వెళ్దామమ్మా! ప్లీజ్! తోవలో శ్రీధర్ వాళ్లకి మన కారు చూపించొచ్చే!" అంటూ కారు గుమ్మంలో ఉన్నట్టే బతి మాలేస్తున్నాడు వెధవ!


ఐదు సంవత్సరాల నుండి మా ఆయనకి ఈ కారు యావ పట్టుకుంది. చిన్నప్పటి నుండి కష్టజీవితం. తన రెక్కల శక్తితో తన వాళ్ళనందర్నీ ఒక స్థాయికి తీసుకు వచ్చి ఇప్పుడిప్పుడే తనకంటూ ఒక ఇల్లు కట్టుకుని ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆయనతోపాటు జాయిన్ అయిన ఆయన కొలీగ్స్, చాలామంది కార్లు కొనేశారు. అప్పుడప్పుడు దర్జాగా కాలేజీకి కార్లో దిగుతూ ఉంటా రట. ఇదంతా చూస్తూ ఈయన కూడా కనీసం మధ్యతరగతి వాళ్ళ కలలోకి కూడా రావడానికి వీల్లేని కారు ఊహల్లో తేలిపోవడం మొదలుపెట్టారు. వాళ్ళంటే అదృష్టవంతులు. వాళ్ళు నేర్చిన చదువుకు నేటి విద్యా వ్యాపారశాలల్లో మంచి గిరాకీ ఉంది. వాళ్ళు కేష్ చేసుకుంటున్నారు వాళ్ళ చదువును. ఈయనా కష్టపడిచదివి గోల్డ్ మెడల్ సంపాదించుకున్నారు. ఆయన రాసిన థీసిస్‌కి ఈమధ్య అవార్డు కూడా ఇచ్చారు.

పాపం! ఈయన కొనుక్కోలేకపోయారు. ఏదో ఎరియర్స్ వస్తాయి. వాటితో కారు తప్పక కొనేస్తానని తెగ కలవరించారు. కానీ, వచ్చే డబ్బు కాస్తా దపదఫాలుగా ఇస్తాననడంతో ఆ ఆశా నీరుకారిపోయింది. ఇక ఈ సందర్భం మళ్ళీ మా ఆయన ఆశకు నీరు చిలకరిస్తోందన్న మాట. అమాయకులు పాపం! "కార్ల దిగుమతిపై సుంకం" అన్న ఈరోజు వార్త చూశారో, లేదో! ఏ సందర్భాలైనా బడుగు ప్రజల వృత్తులపైన, కోళ్ళ పెంపకం, నేత పరిశ్రమలాంటివాటిపై ప్రభావం చూపించి వాళ్ళ జీవితాలను మింగెయ్యడానికి ఉపయోగపడతాయి తప్ప మనలాంటివాళ్ళ అతిపెద్ద ఆశలను తీర్చడానికి కాదు. అసలే నా మనసు మావుళ్ళమ్మ పరిస్థితి చూసి చలించిపోయి ఉంది. ఈ మాటలతో మరింత రగులుకుంది.

** ** **

నిన్న పొద్దుట అమ్మని, నాన్నని చూసివద్దామని ప్రయాణమై వెళ్ళాను. వాళ్ళిద్దరూ తరచూ ప్రయాణం చేసి ఎక్కడికీ రాలేరు. పిల్లల్ని చూడాలని ఉంటుంది వాళ్ళకి. ఉన్న నలుగుర్లో నేనే కొంచెం దగ్గర్లో ఉన్నాను. అందుకే పదిరోజులకొకసారైనా చూసివస్తాను. ఈసారే పిల్లవాడికి పరీక్ష అనీ, ఆయనకు 'ఇన్విజిలేషన్' ఉందని ఆలస్యం చేశాను. పిల్లలం మేం నలుగురం మా పొట్టమేము పోసుకుంటూ ప్రశాంతంగానే ఉన్నాం. ఎవరి దగ్గరైనా వచ్చి ఉండవచ్చుకానీ, నాన్నగారు రారు. ఆయనకు ఆ పేట కన్నతల్లి. అక్కడ వాళ్ళందరూ ఆయన పిల్లలే! వాళ్ళందరి బాధలు ఆయనవే! ఆ చిన్నపేట మంచీ- చెడూ చూడడం, దానితో మమేకమవడం ఆయనకిష్టం. ఎవరి ఇష్టంలో వారికి శాంతి దొరుకుతుంది. అందుకే మేం ఎవరం బలవంతం పెట్టలేదు. అమ్మకి ఆయన మంచీ చెడూ చూడడంతోనే శాంతి. ఇంక ఏం చెప్తాం?

ఆ పేటలో మొదట పునాదిరాయి ఆయనే పాతేరు. 'మల్లయ్య' అని ఒక పెద్ద మనసుగలాయన తనవారందరికీ అక్కడ స్థలాలన్నీ ఊరికే ఇచ్చారు. అందుకే ఆ పేటలో చాలావరకు నేతపనివాళ్ళే ఉండేవారు. వాళ్ళకి ఇస్తూ, వాళ్ళ పిల్లలకు పాఠాలు చెప్పే మాష్టర్లకు కూడా కొంత స్థలం ఇచ్చి ఇళ్ళు కట్టుకోమన్నాడు. అలా నాన్నగారికీ వచ్చింది ఆ స్థలం. అప్పటినుండి ఎంతోమంది అధికార్లకు అప్లికేషన్లు పెట్టించి నాన్నగారే తిరిగి కుళాయిలు, కరెంటు, రోడ్లు అన్నీ ఒకటీ ఒకటీ తీసుకు వచ్చారు. ఇప్పుడది ఒక పెద్ద పేటగా మారిపోయింది. ఆ కాలంనాటి పెద్దల నుండి, మా పిల్లల తరం వరకు అందరికీ నాన్నగారు నాన్నగారే! అలాగే పిలుస్తారు



కూడా.

ఆ ఊరిలో నేను అడుగుపెట్టేటప్పటికి నేను ఎనిమిదేళ్ళ పిల్లని. మాస్టా రమ్మాయని ఎవరూ నన్ను కింద నడవనిచ్చేవారు కాదు. ఊరిలో చాలా భాగం నేతపనివాళ్ళే! తెల్లవారుఝామున మెలకువ వచ్చి బయటకు వస్తే, వెన్నెల్లో చుక్కలు కోలాటం ఆడుకుంటున్నట్టు లయబద్ధంగా మగ్గాల చప్పుడు వినిపించడం నేను ఎప్పుడూ మరిచిపోలేని ఓ జ్ఞాపకం. ఆ ఉదయసంధ్యలో నిద్రమగతలో ఆ చప్పుడు చాలా సమ్మోహనంగా ఉండేది. వెలుగు వచ్చాక పసమ్మాయి నారాయణమ్మ పెట్టే ముగ్గు చూడడానికి వీధిలోకి చేరేవాళ్ళం నేనూ తమ్ముడూ! ఎందుకంటే నాలుగు వేళ్ళ మధ్యలోంచి ముగ్గు జారవిడుస్తూ రోజుకోరకం పక్షుల్ని గుమ్మం ముందు నిలబెట్టేది. ఇంకా ఈ వింతలోంచి తేరుకోకుండానే అంతకంటే విచిత్రమైన దృశ్యం రోడ్డుమీద కనబడేది!

అప్పట్లో మాలెక్కకు అందనంత పొడవైన వివిధ వర్ణాల దారాలు ఈ చివర నుండి ఆచివరకు కర్రలకు ముళ్ళువేసి ఉండేవి. చిన్న తుండు గుడ్డలు కట్టుకుని ఇద్దరు మగవాళ్ళు ఆ దారాలకు, అదోరకంగా ఉండే కుంచెలాంటి చీపుళ్ళతో గంజిరాస్తూ అటూ, ఇటూ నడుస్తూ ఉండేవారు, వాళ్ళతోపాటు ఆ రంగుల దారాల్ని చూస్తూ, వాటిని ముట్టుకోవాలన్న కోరికను మనసుతో పెనవేస్తూ తిరుగుతూ ఉండేవాళ్ళం, అమ్మ పిలిచేవరకు.

స్కూలు నుండి రావడమేమిటి, నేను మావుళ్ళమ్మ అరుగెక్కి కూర్చునేదాన్ని. మా ఇంటి ఎదురుగానే ఉండేది వాళ్ళ ఇల్లు. ఆదివారమైతే ఒంటిగంటకు వెళ్ళిపోయేదాన్ని. నాకోసం వేరుశెనగపప్పు ఉండలు, జీళ్ళు దాచి ఉంచేది. మధ్యాహ్నమప్పుడు ఎప్పుడూ రాట్నం తిప్పుతూ ఉండేది. నన్ను చూడగానే లేచి, పప్పుండ నా చేతిలో పెట్టి పక్కనే కూర్చోపెట్టుకునేది. ఒక చేత్తో కండి పట్టుకుని ఒక చేత్తో తిప్పుతూ దారమంతా చిలపలు చిలపలుగా మార్చేసేది. నేనూ సరదాపడి ఒక్కసారి తిప్పుతే దారం పుటుక్కుమనేది. అప్పుడు నాకు మావుళ్ళమ్మ మంత్రగత్తెలా అనిపించేది. తెగిపోయిన దారాలన్నీ నాకిచ్చేది. ఆ రంగురంగుల దారాలతో బొమ్మలకు జడలు వేసి ఆడుకునేవాళ్ళం. మావుళ్ళమ్మకు పిల్లలు లేరు. ఏ పండగొచ్చినా నన్ను తీసికెళ్ళి రెండు జడల నిండా పెరట్లో పూసిన కనకాంబరాలమాల వత్తుగా పెట్టి పంపించేది. తన దగ్గర మా అమ్మదగ్గరకంటే బాగుండేది. చదువుకోమనదు ఎంతసేపైనా అని.

ఒకసారి దీపావళికి మేమంతా కాకరపువ్వొత్తులూ, మతాబులు కాల్చుకుంటూ ఉన్నాం. ఇంతలో ఎక్కడనుండో ఒక తారాజువ్వ 'జయ్'మని దూసుకుంటూ మావుళ్ళమ్మ పాకలోకి వెళ్ళిపోయింది. వెళ్ళడం, వెళ్ళడం వాళ్ళాయన తొడలోపలికి దిగిపోయింది. ఆ సమయంలో అతను గోచీ పెట్టుకుని మగ్గంమీద కూర్చుని చీరనేస్తున్నాడట. అప్పుడు ఎవరూ సాయంలేక చాలా ఇబ్బంది పడింది పాపం! నాన్నగారు రోజూ సైకిల్‌మీద కూర్చోపెట్టుకుని గవర్నమెంటు హాస్పటల్‌కి తీసికెళ్ళి కట్టు కట్టించేవారు. చాలా రోజులకు గాయం మానింది. కానీ మామూలు మనిషి కాలేకపోయాడు. మావుళ్ళమ్మే పనంతా తన రెండు చేతుల్తోనూ సమర్థించుకునేది.

"పెద్దపెద్ద పొడుగైన చీరలు చేస్తాడు? చిన్న గోచీ పెట్టుకుంటాడేమిటి బసవయ్య" అని తమ్ముడు అడుగుతే, "అయన్నీ నీ పెళ్ళానికి బాబూ! మాకు ఈ గోచీ మిగిలితే చాలు' అని నవ్వించేసేది. ఎప్పుడూ బసవయ్య లోతుగా ఉన్న గోతిలో కాళ్ళు పెట్టి, ఒక చెయ్యి ఇటూ, ఒక చెయ్యి అటూ ఆడిస్తూ మిషను తొక్కుతున్నట్లు తొక్కుతూ ఉండేవాడు. (ఆ సమయంలో) దీక్షగా, డాన్స్ చేస్తున్న కళాకారుడు గుర్తుకొస్తాడు ఇప్పుడు తలుచుకుంటే! ఆ దారాలన్నీ కలిసి బట్టగా మారిపోతుంటే బలే తమాషాగా ఉండేది. ఇంక అతను ఈలోకంలో ఏపనైనా చేసెయ్యగలడనిపించేది. పలక బీటవారితే "బసవయ్య అతికించేస్తాడేమో! నాన్నగారు తిట్టకుండా" అని తమ్ముడూ నేనూ ఆశ పడేవాళ్ళం. వాళ్ళ కష్టం. ఆ కష్టానికుండే విలువా ఈ వ్యాపార ప్రపంచంలో చాలా స్వల్పమని తెలియదప్పుడు నాకు. ఈ యాంత్రికయుగంలో అతని జీవితాన్ని అతడు దట్టంగా నేసుకోలేని అప్రయోజకుడిగా మిగిలిపోతాడని ఊహకందని వయస్సు మాది. నా పెళ్ళి వరకూ కూడా అలా నేస్తూనే నా జీవితంతో పెనవేసుకుని ఉన్నారు. నా పెళ్ళప్పుడు ఒక ఎర్రంచు కోరా చీర తెచ్చి ఇచ్చింది మావుళ్ళమ్మ. ఆ చీర నా చిన్నప్పటి కలలనేతగా నేను దాచుకున్నాను. 'ఆ చీరకి సంఘంలో చాలారోజులు డబ్బుకట్టింది మావుళ్ళమ్మ' అని అమ్మ బాధపడినప్పుడు- నాకు ఆ చీర మరింత విలువ యినదయింది.

నా పెళ్ళయిన సంవత్సరమే మావుళ్ళమ్మ వాళ్ళ ఆడపడుచు కూతుర్ని తెచ్చుకుని దగ్గరపెట్టుకుంది. అప్పటికి ఆ పిల్లకి పధ్నాలుగేళ్లు ఉంటాయి. మావుళ్ళమ్మకి అన్ని పనుల్లోనూ సాయంగా ఉండేది ఆ పిల్ల. ఆ అమ్మాయి

అమ్మా, నాన్న కరీంనగర్ దగ్గర ఒక చిన్న పల్లెటూర్లో ఉంటారుట. అక్కడ చేనేత పనివాళ్ళకి మంచి అవకాశాలున్నాయని ఇటునుండి అక్కడకు వెళ్ళి స్థిరపడిపోయారు. అక్కడ నేసిన తువ్వాళ్ళకి పంచలకీ మంచి గిరాకీ ఉండేదట.

ఆ పిల్లని తెచ్చుకున్న మూడేళ్ళకే పెళ్ళి చేసేసింది మావుళ్ళమ్మ. గౌరిని తెచ్చుకున్నప్పుడు ఇక్కడ కుట్టుపని నేర్చుకుని సంపాదిస్తున్న తన తమ్ముడికిచ్చి పెళ్ళి చేసి తన దగ్గరగా ఉంచుకుందామని అనుకుంది. కానీ గౌరి తల్లీదండ్రీ ఆ పిల్ల పుట్టినప్పుడే వాళ్ళ మేనత్త కొడుక్కి ఇవ్వాలని అనుకున్నారుట. అతనికి మంచి మగ్గం ఉంది. చేతిలో మంచి నేర్పు ఉంది ఆ పిల్లాడికి. ఏ లోటూ ఉండదని మావుళ్ళమ్మని ఒప్పించి పెళ్ళిచేశారు. వీళ్ళను కూడా గౌరి అక్కడికే తీసుకెళ్ళిపోయింది. ఆ తరువాత అప్పుడప్పుడు తమ్ముడు ఇంటికి వచ్చి ఇక్కడ ఉన్న ఇల్లూ అవీ చూసు కుని వెడుతూ ఉండేవారు. ఆ తరువాత అక్కడ మరో మగ్గం మీద కొంత పెట్టుబడి పెడితే ఇంకా పరిస్థితి బాగుంటుందని వాళ్ళు సలహా ఇవ్వడంతో- ఇక్కడున్న ఇల్లు- వాకిలీ అమ్మేసుకుని వెళ్ళిపోయింది. తరువాత తనని నేను చూడలేదు.

చాలారోజులకు ఇదిగో- నిన్న వెళ్ళినప్పుడు చూశాను. నేను ఇంటికి వెళ్ళేటప్పటికి నాన్నగారు ఇంట్లో లేరు. ఎక్కడకు వెళ్ళారని అమ్మని అడిగితే- మావుళ్ళమ్మ ఊళ్లోకి వచ్చింది. చూసి- పలకరించి వస్తానని వెళ్ళేరని చెప్పింది. వాళ్ళ తమ్ముడు మాకు చిన్నప్పటినుండీ బట్టలు కుడతాడు. నాన్నగారికయితే చాలా ఇష్టంగా చొక్కాలు కుట్టి తెచ్చేవాడు. అతను నాన్నగారికి మంచి స్నేహితుడు. నాన్న గారి స్నేహాల్లో ఆర్థికపరమైన, కులపరమైన భేదాలుండేవి కాదు. సంస్కారపరమైన భేదాన్ని మాత్రం పాటిస్తారు ఇప్పటికీ. అందుచేత రాజు ఇంటికి వెళ్ళడం నాన్నగారికి అలవాటే! అలాగే వెళ్ళేరని అనుకున్నాను.

ఇంటికి రావడమే నాన్నగారు చాలా 'డిస్టర్బ్‌డ్'గా వచ్చారు. నన్ను చూసి కూడా ఏమీ ఉత్సాహాన్ని చూపించలేదు. మామూలుగా అయితే, నన్ను చూడగానే ఆ పేటలోని విశేషాలన్నీ- అందరి కష్టసుఖాలతో సహా నాకు చెప్పా కగానీ లోపలికి వెళ్ళనివ్వరు. మా అమ్మ 'దాన్ని లోపలికి రానివ్వండి' అని అన్నా వినిపించుకోరు.

అమ్మని అడుగుతే నెమ్మదిగా చెప్పింది. "మావుళ్ళమ్మ కూతురూ, అల్లుడూ ఆత్మహత్య చేసుకున్నారుట. చూసి వచ్చారు కదా! అందుకని అలా ఉండి ఉంటారు" అంది.

నాకు ఒక్కసారిగా గుండె ఆగినట్టు అనిపించింది. చాలా ధైర్యస్థురాలే మావుళ్ళమ్మ. కానీ ఆ పిల్ల మీదే పంచప్రాణాలు పెట్టుకుని ఉన్న ఊరునీ, కష్టపడి అమర్చుకున్న ఇంటినీ వదులుకుని వెళ్ళింది. ఇప్పుడు ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోగలదు పాపం!

నాన్నగారి దగ్గరగా వెళ్ళి కూర్చున్నాను. నెమ్మదిగా మాట్లాడడం మొదలుపెట్టారు.

"వీళ్ళిద్దరూ మనవరాల్ని తీసుకొని పెళ్ళికి వెళ్ళారట. చాలారోజులుగా మగ్గాలపై నేసినవి అలా ఉండిపోవడం చేత గవర్నమెంటు దగ్గర నుండి డబ్బురాక ఇబ్బంది పడుతున్నారట. చాలాచోట్ల అప్పులు తెచ్చార్ట పదిరూపాయల వడ్డీకి. దాంతో కాస్తో, కూస్తో ఉన్న బంగారం కాస్తా అమ్మేశారుట. తిండికి కూడా కష్టమయిపోయిందట. 'ఈ ఖర్చులో పెళ్ళికి వెళ్ళవేం అమ్మీ!' అంటే వినకుండా పంపించారట. ఇంట్లో వాళ్ళిద్దరే మిగిలారుట. వచ్చేటప్పటికి ఇద్దరూ పురుగుల మందు తాగేసి పడి ఉన్నారట. ఆసుపత్రికి తీసుకెళ్ళినా ఉపయోగం లేకపోయిందట. పాపను మాత్రం మావుళ్ళమ్మ మిగుల్చుకుంది. ఇంక అక్కడ నిలబడలేక, ఆ ఊరిలో రుణం తీరిపోయిందని పిల్లని తీసుకుని ముసలాళ్ళిద్దరూ వచ్చేశారు. ముసలాణ్ని అసలు చూడలేకపోతున్నాం అమ్మాయీ! ఒకమూల చిన్నతుండగుడ్డ పరుచుకుని పడుకున్నాడు. ఉలుకూ పలుకూ లేదు. చిన్నపిల్ల మావుళ్ళమ్మ దగ్గర మాలిమి కావును. బాగానే ఆడుకుంటోంది."

అని మాట్లాడుతూనే నాన్నగారు మళ్ళీ ఆలోచనల్లోకి జారుకున్నారు. బహుశా ఆ చిన్న పాప జీవితం ఆయన కళ్ళల్లో కదలాడుతూ ఉండి ఉంటుంది.

మధ్యాహ్నం అమ్మ, నాన్నగారు భోజనం చేసి పడుకున్నారు. తలుపు చప్పుడు కాకుండా వేసి బయల్దేరాను. మా వెనుకవీధిలో ఉంది. మావుళ్ళమ్మ వాళ్ళ తమ్ముడు రాజు ఇల్లు. ఈ పరిస్థితిలో తన దగ్గరకు వెళ్ళడమంటే చాలా టెన్షన్‌గా ఉంది. ఈ పదిహేను సంవత్సరాలలోనూ ప్రపంచంలో వచ్చిన మార్పంతా ఆ చిన్ని పేటలోనే కనిపిస్తోంది. నా చిన్నప్పుడు ఉన్న పూరిళ్ళ స్థానంలో చాలావరకు భవంతులు వెలిశాయి. మల్లయ్యగారు దానం చేసిన స్థలాలు రెండుమూడు చేతులు మారిపోయాయి. నేత పనివాళ్ళన్నవారు ఒక్కరూ ఇక్కడ మిగల్లేదు. అందరూ ఫైనాన్స్ వ్యాపారస్తులు, కంట్రాక్టర్లు. ఈ పేటలో ఇప్పుడు నివాసమున్నారు. ఏమార్పూ లేకుండా, ఇచ్చినది- కట్టుకున్నవి కట్టుకున్నట్టు కష్టపడి మిగుల్చుకున్న బంగాళాపెంకు ఇళ్ళు నాల్గుగో మూడో ఉన్నాయి. అవికూడా నెలజీతం తెచ్చుకునేవాళ్ళవి.

తల్లీ! నీకు గౌరి అంతగా తెలవదు కానీ అమ్మా, బంగారం. నువ్వు పెళ్లి చేసుకుని వెళ్లిపోయాక మా అరుగు ఖాళీగా అనిపించేది తల్లీ! ఆ సమయంలోనే మాలచ్మిలా వచ్చింది నా తల్లి. చిన్నతనంలోనే ఎంత నిబ్బరంగా ఉండేదో! దానమ్మా, నాన్నా దూరంగా ఉన్నారన్నమాటే తలపెట్టేది కాదు. నా ఎనకమాలే ఉండేది. ఆ పెళ్ళి దానికి చావని నేను అనుకోలేదు తల్లీ!



అటూ- ఇటూ కూడా కదలక నిలవ ఉండిపోయాయి వాళ్ళ బతుకులు.

రాజుది నాలుగు గదుల బంగాళా పెంకు ఇల్లు. వీధి వైపు అంతా ఒక అరుగుకింద వదిలేశాడు. ఒక పక్క అన్నీ కుట్టుమిషన్లు. పిల్లలిద్దరితోపాటు తాను కూడా కష్టపడుతూ బతుకుబండిని ఈడుస్తున్నాడు రాజు. అరుగు మీద రెండోవేపు శూన్యంలోకి చూస్తూ ఒక్కత్తే కూర్చుని ఉంది. నన్నుచూసి లేచివస్తుందని అనుకున్నాను. కానీ రాలేదు. దగ్గరకంటా వెళ్ళాకగానీ నన్ను గుర్తుపట్టలేదు.

"చిట్టమ్మా! నువ్వా!" అంటూ నా చెయ్యి పట్టుకుని తన పక్కన కూర్చోపెట్టుకుంది. ఏమ్మాట్లాడాలో తెలియడంలేదు. కళ్ళలోంచి నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి మావుళ్ళమ్మకు. నన్ను చూడగానే ఆవిడ దుఃఖం కట్టతెంచుకుని ప్రవహిస్తోంది. నా రెండు చేతుల్తోనూ ఆవిడను దగ్గరకు తీసుకున్నాను. దుఃఖంలో మాగిన మృత్యువాసన నా హృదయానికి తాకుతోంది. నా కళ్ళల్లో నుండి కూడా నీళ్ళు. చాలాసేపటివరకు ఇద్దరూ అలాగే ఉన్నాం.

"తల్లీ! నీకు గౌరి అంతగా తెలవదు కానీ అమ్మా, బంగారం. నువ్వు పెళ్లి చేసుకుని వెళ్లిపోయాక మా అరుగు ఖాళీగా అనిపించేది తల్లీ! ఆ సమయంలోనే మాలచ్మిలా వచ్చింది నా తల్లి. చిన్నతనంలోనే ఎంత నిబ్బరంగా ఉండేదో! దానమ్మా, నాన్నా దూరంగా ఉన్నారన్నమాటే తలపెట్టేది కాదు. నా ఎనకమాలే ఉండేది. ఆ పెళ్ళి దానికి చావని నేను అనుకోలేదు తల్లీ! దాని బావ చాలా అందగాడు. మంచి పనున్నోడు. సుఖపడుతుందనుకున్నానమ్మా! ఆ పిలగాడి ఊరు అదే అవడంతో మమ్మల్నీ దాంతోపాటు అదే బలవంతంగా తీసుకుపోనాదమ్మా! వెళ్ళినప్పటి నుండి ఏ రెండేళ్ళు బాగున్నారో! ఆ తరువాతంతా అప్పులు. అప్పులు. ఇదిగో గవర్నమెంటోళ్ళు డబ్బు ఇస్తన్నా రు. అదిగో ఇస్తన్నారు అని అంటానే ఉన్నారు. వచ్చింది- వచ్చింది అన్నారు. కానీ మావరకూ రానేదమ్మా! అయిపోయిందన్నారు. ఊళ్లో కట్టాల్సిన వడ్డీల మీద వడ్డీలు. దాంతో ఇద్దరూ డీలాపడిపోనారు. రోజురోజుకీ ఆ పిల్లాడి అందమంతా ఏమయిపోనాదో- పీనిగలా అయిపోయినాడు. మళ్ళీ నెలకే ఇద్దరూ లేరు. ఎలా బతకను తల్లీ! ఈ చిన్నిముండనేం చెయ్యను చిట్టెమ్మా! ఏమీ తెలవక ఆడుకుంటూన్న ఈ పిల్లను చూస్తే గుండెలదిరిపోతన్నాయమ్మా!" అని ఘొల్లుమంది. నేను ఏమీ మాట్లాడలేదు. ఏం చెప్పి ఆవిడ దుఃఖానికి ఊరట కల్పించాలోనాకుతెలియలేదు. మళ్ళీతనే మొదలుపెట్టింది.

"మనేపువాళ్ళు ఇట్టా ప్రాణాలు తీసుకోరు తల్లీ! కూలికి పోయన్నా బతుకుతారు. సినేమా టిక్కెట్లు బ్లాకు నమ్ముకునన్నా బతికేస్తారు. మా అన్నాయి కొడుకులాగ దొంగనోట్లు మార్చైనా బతుకు రాజాలా వెళ్ళమారుస్తారు కదమ్మా! అటేపు వెళ్ళనివ్వకుండా ఈ మగ్గంతోనే బతకమంటే బాగుండిపోనేమో!"అని పదేపదే గుండెలు బాదుకుంటోంది. రాజు భార్య వచ్చి ఆవిడని పట్టుకుని లోపలికి తీసికెళ్ళింది.

** ** **

ప్రాణాల ముందు, బతుకు భయం ముందు రెక్కల కష్టంతో బతకడానికి అలవాటుపడ్డ మావుళ్ళమ్మ ఆలోచనలో కూడా నీతి- అవినీతి అన్న లక్ష్మణరేఖలు చెరిగిపోవడం నేను చూశాను నిన్న అక్కడ. ఎలాగైనా గౌరి, మొగుడు బతికి ఉంటే బాగుండునని మావుళ్ళమ్మ తలపోస్తోంది. అది ఏ మార్గమయినాకానీ...

ప్రపంచంలో జరిగే అనేకానేకమైన మార్పులు గురించి తనకేం తెలుసు? ఇక్కడ సంభవించిన ఈ మరణాలకి ఎంతోమంది 'పెద్దల' ఆలోచనా విధానాలు కారణమని తెలుసుకుని మాత్రం ఆమె ఏం చెయ్యగలదు? వాళ్ళ ఆలోచనలు ఇంకా అమలులోకి పూర్తిగా రానేలేదు. ఇంతలోనే ఎన్నో వైపరీత్యాలు.

అనేకానేకమైన సంస్కరణలు వెల్లువలా దూసుకువస్తున్నాయి. కాలస్వభావమే మార్పు. దాన్ని ఆపడం ఎవరి తరమూ కాదేమో! ఆ ప్రవాహాన్ని ఉపయోగించుకుని, తలెత్తి చిగిర్చి ఫలవంతమయ్యే మొక్కలు కొన్ని ఉంటాయి. అలా కాలానికి ముందే మేలుకుని కాలస్వభావం చేత వచ్చే మార్పుని తనకు అనుగుణంగా మార్చుకుని జీవనవిధానానికి మెరుగుపెట్టుకునే వాళ్ళు కొంతమంది ఉండవచ్చు. చాలా మొక్కలు వెల్లువకి తలవంచి ఒరిగిపోయేవే ఉంటాయి. అలాటి వాళ్ళు వీళ్ళు. అన్ని రకాలైన మార్పులు వీళ్ళ జీవితాల్ని ఇంకా దిగువస్థాయికి తీసుకువెడుతున్నాయి తప్ప మరే ఉపయోగమూ కనిపించడంలేదు. కాలానుగుణంగా వచ్చే అన్నిటిలోనూ దిగజారుడుతనం మన కళ్ళముందుకు వస్తున్నప్పుడు దిగులుపడడం మినహా నేనేమి చెయ్యగలను? ఒక్క మానవత్వాన్ని, దాని ధర్మమైన కరుణని విడిచిపెట్టకుండా ఉండడం తప్ప. ఆ కరుణ ఒక్కటే వెల్లువకు కొట్టుకుపోయేవారికి చేయూత నివ్వగలదు. .

ఇటుపైన నేను రాజమండ్రి వెళ్ళి చూడవలసిన మనుషుల సంఖ్య రెట్టింపయ్యింది. తరచు వెళ్ళి గౌరి పాప నా ఉనికిని గుర్తించేలా చేయాలన్న నిశ్చయం తప్ప నేను ఇప్పుడు తక్షణం చేయగలిగింది ఏముంది?